క్లుప్తంగా

మండల సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ వర్షం కురుస్తున్న కారణంగా ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కాలేకపోయారని, అందువల్ల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

22న జాబ్‌మేళా

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు మిని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కార్యాలయం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. యంగ్ ఇండియా కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.పది నుంచి డిగ్రీ వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. అసక్తిగలిగిన మహిళా, పురుష అభ్యర్థులు విద్యార్థత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8897776368 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ: క్రీడాజ్ఞాన్ పరీక్షకు ఆసక్తిగల క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని క్రీడా భారతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, నరేష్‌బాబు తెలిపారు. ఈనెల 14 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు తెలిపారు. 12 సంవత్సరాలుపైడిన క్రీడాకారులు ఇందులో పాల్గొనవచ్చునన్నారు. ఆన్‌లైన్ గ్రూపు రిజిస్ట్రేషన్‌కు వచ్చే నెల 30వ తేదీలోపు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 6వ తేదీలోపు చేసుకోవాలని సూచించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 6281881022 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మండల అభివృద్ధికి కృషి



ఎంపీడీఓ అబ్దుల్ కలాం

పెద్దతిప్పసముద్రం: మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓగా అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. పెద్దతిప్పసముద్రం ఎంపీడీఓగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలో పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన కేఎస్ బాలాజీ పెద్దపంజాణి మండలానికి బదిలీ అయ్యారు.

టమాటా ధరలు పతనం



కలకడ టమాటా మార్కెట్‌లో నిల్వ చేసిన టమాటా

కలకడ : కలకడ మార్కెట్‌లో బుధవారం టమాటా ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా నాణ్యమైన 15 కిలోల టమాటా బాక్స్ ధర వెయ్యి రూపాయలకు తగ్గకుండా పలకడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మచ్చలు, రంధ్రాలు పడిన సరుకును నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలకడ టమాటా మార్కెట్‌లో 15 కిలోల బాక్స్ రూ.400లకు విక్రయించినట్లు రైతులు తెలిపారు.

పరామర్శ



చిన్న రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పీలేరు రూరల్ : ఏనుగుల దాడిలో మృతి చెందిన మోపిరెడ్డి చిన్న రాజారెడ్డి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం బందారువాండ్లపల్లెకు చేరుకుని చిన్నరాజారెడ్డి మృతదేహానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు మోహన్‌రెడ్డి, ఉదయ్, ఆనంద్, చక్రధర్, భాస్కర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏం కొంటాం.. ఏం తింటాం!

ఏం కొనేటట్టు లేదు..ఏం తినే టట్టు లేదు.. అన్న ఓ సినీగేయానికి తగ్గట్టుగా కూరగాయల ధరలు చుక్కలు తాకుతున్నాయి. నెలరోజులుగా కాయగూరల ధరలు పెరుగుతునే ఉన్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో ధరలు పైపైకి పోతున్నాయి. ఏది పట్టుకున్నా మండుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఏ కూరగాయలు కొనే పరిస్థితి కనిపించడం లేదు. ఆకు కూరల ధర సైతం అదిరిపోతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

- భగ్గమంటున్న కూరగాయల ధరలు
- సామాన్యుడికి ధరాఘాతం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



మార్కెట్‌లో కూరగాయలు

మదనపల్లె సిటీ: కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా నాలుగు రకాలు వచ్చే పరిస్థితి లేదు. నెల రోజులుగా ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏం కొంటాం.. ఏం తింటాం.. అన్న చందంగా మారింది. మార్కెట్‌కు వెళ్లి కిలో కొనుగోలు చేయాలనుకునే వారు పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఎన్నడూ లేని విధంగా మదనపల్లె దినసరి మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పంట దిగుబడులు తగ్గడంతో వినియోగదారులపై భారం పడుతోంది. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో రైతులు వరి, వేరుశనగ, టమాటా పంటలతో పాటు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అయితే వర్షాభావం కారణంగా పంటల దిగుబడి తగ్గిపోయింది.

కొత్తిమీర కొనలేకపోతున్నాం

కూరగాయాలు కొన్నప్పుడు కొద్దిగా కొత్తిమీర, కరివేపాకు ఇవ్వడం పరిపాటి. ప్రస్తుతం కొత్తిమీర చిన్నకట్ట రూ.20, పెద్దది రూ.40 వరకు కొనాల్సి వస్తోంది. కరివేపాకు కావాలంటే రూ.20 చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. అల్లం కేజీ రూ.100, మునగకాయలు కిలో రూ.120, వంకాయ రూ.50, పచ్చిమిరప రూ.50, బెండ రూ.50, దొండ రూ.40, టమాటా రూ. 50, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, తెల్లగడ్డలు కిలో రూ.500, పలుకుతున్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి దిగుబడి

మదనపల్లె పట్టణం వారపుసంత కేంద్రంగా కూరగాయల వ్యాపారం జరుగుతుంది. మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి టమాటా, వంకాయలు, మునగ, బెండ, కాకర, గుమ్మడి వస్తుండగా, కర్ణాటక నుంచి క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్, అనంతపురం జిల్లా నుంచి అలసంద, బీన్స్, గోరుచిక్కుడు దిగుమతి అవుతున్నాయి. గతంలో రోజుకు 400 టన్నుల కూరగాయలు వస్తుండగా ప్రస్తుతం 150 టన్నుల కూరగాయలు వస్తున్నాయి. పంట దిగుబడులు తగ్గడం, తెగుళ్ల సోకడంతో పంటలు చేతికి రావడం లేదు.

కార్తీకమాసం ముగిసే వరకు ఇదే పరిస్థితా!

కార్తీకమాసం నెల రోజుల అత్యధికంగా కూరగాయాలు వినియోగం ఉంటుంది. అప్పుడు కూడా భారీగా అన్న సంతర్పణలు ఉంటాయి. అలాగే అయ్యప్ప, శివమాలాధారణ దీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ధరల భారం కార్తీక మాసం చివరి వరకు కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి కూరగాయల సరుఫరా పెరిగేలా చర్యలు తీసుకుంటే ధరలు అనుకూలంగా ఉంటాయని ప్రజలు కోరుతున్నారు.

ఏం కొనలేని పరిస్థితి



కూరగాయల ధరలు భారీగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. వీటితో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. గతంలో రూ.500 కేటాయిస్తే నెలలో నాలుగు వారాలు సరిపోయేది. ప్రస్తుతం ఇంట్లో సాధారణ వాడకమైనా వెయ్యి వరకు దాటుతోంది. ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రించాలి.

– వసంత, గృహిణి, కాలేజీ రోడ్డు, మదనపల్లె

మదనపల్లెలో జడివాన

- పట్టణంలో వీధులు జలమయం
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

మదనపల్లె: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండగా మదనపల్లెలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు జడివాన కురిసింది. రాత్రి 7.30 నుంచి పగలు 11 గంటల వరకు నిరంతరాయంగా వర్షం కురిసింది. జడివానతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీధుల జలమయం కాగా మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. చెరువుల్లోకి స్వల్పంగా నీరు వచ్చి చేరింది. వర్షానికి చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు అవస్థలు పడ్డారు. జోరు వానకు అధికశాతం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పట్టణంలోని చిత్తూరు, బెంగుళూరు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో జనసంచారం బాగా తగ్గిపోయింది. బాహుదా, బుగ్గకాల్వ, కురవంకలలో నీటి ప్రవాహం పెరిగింది. టమాటా మార్కెట్‌లో రైతులు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల రోడ్లలో గుంతలు ఏర్పడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. జడ్జి బంగళా సమీపం, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. అధికారులు ముందుస్తుగా లోతట్టు ప్రాంతాలైన బుగ్గకాల్వ, బాపనకాల్వ, రాంనగర్, మేదరవీధి, అనంతయ్య బంగ్లా ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

వర్షపాత వివరాలు



వర్షానికి ప్రవహిస్తున్న కురవంక

మదనపల్లె డివిజన్‌లో ఓ మోస్తారుపాటు వర్షం కురిసింది. మదనపల్లె 42.8, నిమ్మనపల్లె 55.2, కురబలకోట 55.4, బి.కొత్తకోట 36.0, తంబళ్లపల్లె 35.8, ములకలచెరువు 27.8, పెద్దమండ్యం 31.0, వాల్మీకిపురం 52.4, కలికిరి 53.4, రామసముద్రం 26.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

పీటీఎంలో 31.2 మి.మీల వర్షం

పెద్దతిప్పసముద్రం: మండల వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. వర్షం కారణంగా ప్రజలంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. మండలంలో 31.2 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ అశ్విని తెలిపారు.

కలకడలో మండలంలో..

కలకడ : మండలంలో బుధవారం సాయంత్రం వరకూ 15.4 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైనట్లు తహసీల్దార్ పణికుమార్ తెలిపారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి ఎక్కడ అధికంగా చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదని, ప్రమాద చెరువులను బుధవారం పరిశీలించి రెవెన్యూ సిబ్బందిని పర్యవేక్షించాలని ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



దొంతివీధిలో రోడ్డుపై నిలిచిన నీరు

చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే



మదనపల్లె సిటీ: మేడిపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



తంబళ్లపల్లె: పెద్దేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహశీల్దార్ హరికుమార్

మదనపల్లె సిటీ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు బుధవారం మదనపల్లె మండలంలోని చెరువులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిశీలించారు. మండల పరిధిలోని వెంకటమ్మచెరువు, కదిరమ్మ చెరువు, మేడిపల్లి చెరువులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాలకు అధికారులు అప్రతమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెరువులు తెగిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ ఖాజాబీ, ఇరిగేషన్ ఏఈ రాయల్ బాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ రెడ్డప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సహాయక చర్యలకు సిద్ధం

తుఫాన్ బాధితులకు అన్ని వేళలా సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ తెలిపారు. మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలకు సహాయక చర్యలు, ఆహారం కోసం ఇబ్బందులు పడినా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఫయాజ్, కిరణ్, ఖాజా పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పరిశీలన

తంబళ్లపల్లె: తుఫాను వర్షాల కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం తహసీల్దార్ హరికుమార్, ఇరిగేషన్‌శాఖ డీఈ సురేష్‌బాబు, ఏఈ సతీష్‌కుమార్ పెద్దేరు, చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టులను పరిశీలించారు. నీటి నిలువ సామర్థ్యం, ప్రస్తుత నీటి నిల్వ, అవుట్‌ఫ్లో, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై చర్చించి ఉన్నాతాధికారులకు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఉద్యోగులను అప్రమత్తం చేశారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

బి.కొత్తకోట: బీరంగి పెద్దచెరువు, ఆలేరు వాగు, నాగలచెరువులను తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ, ఎంపీడీఓ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు చెప్పారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ధరణికుమార్

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల ధరణికుమార్ కోరారు. బుధవారం పంచాయతీ ఈఓ గురుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్టాండు ప్రాంతంలో ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ జైలు, ఎంఆర్‌సీ, భవితా కేంద్రం, హౌసింగ్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, దినసరి కూరగాయల మార్కెట్ ఉందన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు, మహిళలు. కూరగాయల మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, వినియోగదారులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, తుమ్మల కళల్‌కుమార్ పాల్గొన్నారు.

సంతాపం



నివాళులు అర్పిస్తున్న ఎస్. నిస్సార్‌అమ్మద్

మదనపల్లె సిటీ: సినీ నిర్మాత, ప్రముఖ సినీ నటి రమాప్రభ సోదరి కుమారుడు సురేష్ మృతికి మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఎస్. నిస్సార్‌అమ్మద్ సంతాపం ప్రకటించారు. మదనపల్లె పట్టణం పంచరత్న టాకీసు వద్ద మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ–1 డిపో నుంచి బుధవారం శబరిమలకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. దీంతో పాటు మరో రెండు బస్సులను కూడా శబరిమలకు పంపనున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి

వాల్మీకిపురం: వాల్మీకిపురం సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు హెచ్చరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. పాత భవనాల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తకకూడదన్నారు. గాలి, వర్షానికి విడిగిపడిన విద్యుత్ వైర్లను ముట్టుకోకూడదని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు వద్ద సెల్ ఫోన్ మాట్లాడకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు 9440796714, వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్ 9440900712, గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడు 9440900714 ను సంప్రదించాలని కోరారు.

మదనపల్లె: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగే అవకాశం ఉందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని మదనపల్లె అగ్నిమాపక అధికారి జీ.శివప్ప కోరారు. ప్రమాదాలు సంభవిస్తే వెంటనే మదనపల్లె పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు 101 లేదా 08571–222101, 9963735597 ఫోన్ నంబర్లకు సమాచారం అందించి తక్షణ సహాయం పొందాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు.

అప్రమత్తంగా ఉండండి

మదనపల్లె సిటీ: కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి సూచించారు. బుధవారం ఆమె స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే 08571–222280కు ఫోన్ చేయాలని కోరారు. సిబ్బందిని కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పెద్దమండ్యం: గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని దిగువపల్లెలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. దిగువపల్లెలో రూ. 8 లక్షలు, పెద్దమండ్యం, మిట్టమాలపల్లెలో రూ.8 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏపీడీ మధుబాబు, ఏపీఓ మురళి, పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

తంబళ్లపల్లె: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం తంబళ్లపల్లె, రెడ్డికోటలో సీసీ రోడ్ల నిర్మాణానికి టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీడీ మధుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు

కలికిరి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. మండల పరిధిలోని మునెల్లపల్లి, మేడికుర్తి పంచాయతీల పరిధిలో ఎలు సిమెంటు రోడ్డు పనులను ఉపాధి హామీ నిధులతో ప్రారంభించారు. ఉపాధిహామీ ఏపీఓ సుజాత, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన ఆలయం పరిశీలన

ములకలచెరువు: మండల కేంద్రంలోని శ్రీ కనుగొండరాయస్వామి ఆలయాన్ని బుధవారం సీఐ రాజారమేష్ పరిశీలించారు. ఆలయం సమీపంలో నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అయితే రాత్రి కురిసిన వర్షానికి ఆలయం పూర్తిగా ధ్వంసమైంది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్లూస్ టీం పిలిపించి దర్యాప్తు వేగవంతం చేస్తామని తెలిపారు.

ఆలయాన్ని పరిశీలించిన ఇన్‌స్పెక్టర్

కనుకొండ రాయస్వామి ఆలయం సమీపంలో నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై సాక్షి పత్రికలో బుధవారం వచ్చిన కథనానికి మదనపల్లి డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ స్పందించి ధ్వంసమైన ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.



ధ్వంసమైన ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఆహార, ఉపాధి భద్రత కల్పించాలి

నిమ్మనపల్లె : వ్యవసాయ కూలీలకు ఆహార, ఉపాధి భద్రత కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.శోభ తహసీల్దార్ ధనుంజయులుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 16న ప్రపంచమంతా ఆహార దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారని, కానీ అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆహార దినోత్సవాన్ని ×ఆకలి దినంగ్గా పరిగిణిస్తున్నమన్నారు. నేడు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో , సామాన్య ప్రజలు కొని తినలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. కూలీలకు పని లేక, పనికి తగిన వేతనం అందక, కుటుంబాలను పోషించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీవీవీయూ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ

ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సిబ్బంది సమిష్టిగా పని చేసి ఆదాయాన్ని పెంచాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీసీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన రూట్లలోని కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, సిబ్బంది ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆదాయాన్ని అధికంగా తెచ్చిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

పీలేరు : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి పీలేరుకు చెందిన పారా మిలిటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. లక్ష విరాళం అందజేశారు. పారా మిలిటరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఎస్. ఖాన్, కార్యదర్శి పి. చంద్రశేఖర్, సలహాదారుడు బి.సి. రెడ్డెప్ప, కోశాధికారి రమణ విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేశారు.

వరదబాధితులకు విరాళం

మదనపల్లె: విజయవాడలో ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులకు అండగా నిలిచి గ్లోరిపాస్టర్ అసోసియేషన్ విరాళం అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి రూ.10,116 డిడిని క్రైస్తవ పాస్టర్ల అసోసియేషన్ తరపున అందించారు. వరదల్లో విజయవాడ వాసులు సర్వం కోల్పోయారన్నారు. ఆపదలో ఉన్నవారని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్లోరిపాస్టర్ అసోసియేషన్ మదనపల్లె అధ్యక్షుడు జాన్‌బాబు, పాస్టర్ జీవరత్నం, శ్యామ్‌సన్, డానియల్‌నాయక్, సుధాకర్, దేమణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వరదబాధితుల సహాయార్థం చెక్కు అందజేస్తున్న గ్లోరిపాస్టర్ అసోసియేషన్ సభ్యులు

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరగాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన తల్లీ బిడ్డ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యులు

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో దేవులపల్లె గ్రామానికి చెందిన శకరయ్య భార్య బొజ్జమరియమ్మ పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చింది. ఆరోగ్య సిబ్బంది భారతమ్మ, లక్ష్మిదేవి, వైద్యుల సలహాలు, సూచనలతో సుఖప్రసవం చేసినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు.

